
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శుక్రవారం
13 మార్చి 2026
పేజీలు : 08



# ప్రపంచ శాంతి కోసం ఉప్పల్‌లో భారీ శాంతి ప్రదర్శన

- యుద్ధాలు సమస్యలకు పరిష్కారం కావు - చర్చలే మార్గం
- ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలకు వ్యతిరేకం
- వృద్ధులు, విద్యార్థులు, సామాజిక సేవకులు పాల్గొన్నారు
- శాంతి సందేశాలతో నినాదాలు
- ప్రపంచ దేశాలు చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించాలి



**ఉప్పల్, మార్చి 12 (జనం సాక్షి):** ప్రపంచ శాంతి కోసం ఉప్పల్ ప్రాంతంలో గురువారం భారీ శాంతి ప్రదర్శన నిర్వహించారు. ఇజ్రాయెల్, అమెరికా, ఇరాన్ దేశాల మధ్య పెరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతలకు వ్యతిరేకంగా శాంతిని కోరుతూ సామాజిక సేవకుడు మేకల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గాంధీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శనలో వృద్ధులు, పాఠశాల విద్యార్థులు, వివిధ రాజకీయ పక్షాల నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చేతుల్లో శాంతి సందేశాలతో కూడిన పలకలు పట్టుకుని "యుద్ధం కాదు - శాంతి కావాలి", "సమస్యలకు చర్చలే పరిష్కారం" అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడినవారు యుద్ధాలు మానవాళికి మేలు చేయవని, ప్రాణ నష్టం, ఆర్థిక నష్టం మాత్రమే జరుగుతాయని తెలిపారు. దేశాల మధ్య సమస్యలను యుద్ధాల ద్వారా కాకుండా చర్చలు, సంభాషణలు, దౌత్య మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రపంచంలో పెరుగుతున్న యుద్ధ పరిస్థితుల వల్ల అనేక దేశాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, వాణిజ్య కార్యకలాపాలు దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశం నుంచి ఇతర దేశాలకు వెళ్లే పంటలు, వస్తువులపై ప్రభావం పడే అవకాశముందని, విదేశాల నుంచి వచ్చే నిత్యావసరాల సరఫరా కూడా అంతరాయం కలగవచ్చని తెలిపారు. యుద్ధాలను విరమించి శాంతి మార్గాన్ని అనుసరించాలని, ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించేందుకు శాంతియుత చర్చలు జరపాలని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ శాంతి ప్రదర్శన నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనలో ఉప్పల్ ప్రాంతానికి చెందిన వృద్ధులు, విద్యార్థులు, సామాజిక సేవకులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రపంచ శాంతికి తమ మద్దతు తెలిపారు.



- కొందుర్గులో మురికి నీటి నరకం
- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీరు.. కాలనీవాసుల ఆవేదన
- అభివృద్ధికి అడ్డంకులు.. రాజకీయ కారణాల ఆరోపణలు

# డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

**కొందుర్గు, మార్చి 12 (జనం సాక్షి):** రంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన కొందుర్గు 1వ వార్డు కాలనీ వాసులు మురికి నీటి నరకయాతన అనుభవిస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో మురుగు నీరంతా రోడ్లపైనే ప్రవహిస్తోంది. దీంతో కాలనీలో అడుగు పెట్టాలంటేనే స్థానికులు అసహ్యించుకుంటున్నారు. "మా కాలనీని సందర్శించండి మహాప్రభో" అంటూ అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్న పరిస్థితి నెలకొంది. గత కొన్నాళ్లుగా మురికి నీరు రోడ్లపై నిలిచిపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. చిన్నపిల్లలు, వృద్ధులు అంటువ్యాధుల బారిన పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో నడవాలంటే బురదలో నుంచి వెళ్లాల్సి వస్తోందని, ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలనీలో మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, వెంటనే అండర్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులు కాకుండా పక్కా ప్రణాళికతో డ్రైనేజీ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

మరోవైపు కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు ఉన్నప్పటికీ, కొందరు వ్యక్తులు కావాలనే అడ్డంకులు సృష్టిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రాజకీయ కారణాలతోనో లేదా వ్యక్తిగత ప్రయోజనాల కోసమో అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అడ్డంకులను తొలగించి పనులు ప్రారంభించాలని 1వ వార్డు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.






**సామాన్యుడి నుండి అసామాన్యుడిగా ఎదిగిన శీనన్న నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయనలో ఉన్న మంచితనం, మానవత్వమే ఇంతమంది అభిమానానికి కారణమని తాండూరు ప్రజలు చర్చించుకుంటున్నారు. మనస్ఫూర్తిగా మాట్లాడే, నోటి నిండా పలుకరించే శీనన్నకు ఇంతమంది అభిమానం చాటడం గమనార్హం. ఆపదలో ఉన్న అభాగ్యులకు అండగా నిలిచిన సందర్భాలను గుర్తు చేస్తూ ఇలాంటి మహోన్నతమైన మనస్సు ఉన్న బుయ్యని శ్రీనివాస్ రెడ్డి ప్రజా ప్రతినిధిగా రావాలని జనం కోరుకోవడం కనిపిస్తోంది.**

# సామాన్యుడి నుండి అసామాన్యుడిగా ఎదిగిన శీనన్న

## కనులపండుగలా శీనన్న జన్మదిన వేడుకలు



- ఉప్పొంగిన అభిమానం రాజకీయాల్లో ప్రత్యేక చర్చ
- ప్రజాబలంతో పాటు దైవ బలం తోడు





**తాండూరు, మార్చి 12 (జనం సాక్షి):** ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి (శీనన్న) జన్మదిన వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. ప్రజా ప్రతినిధి కాకపోయినా, కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక పదవి లేకపోయినా తాండూరు-పరిగి వ్యాప్తంగా శీనన్న అభిమానం ఉప్పొంగుతోంది. ఇటీవల జరిగిన జన్మదిన వేడుకలు రాజకీయ పార్టీల నేతలను ఆశ్చర్యానికి గురి చేసే విధంగా జరిగాయి.

పార్టీలకు అతీతంగా బుయ్యని శ్రీనివాస్ రెడ్డికి ప్రజలు, అభిమానులు ఆప్యాయతను చూపుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తాండూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో సైతం అభిమానులు బర్త్‌డే కేక్ కట్ చేసి అభిమానాన్ని చాటారు. మండల కేంద్రాల్లో అన్నదాన కార్యక్రమాలు, నోట్‌బుక్స్, పెన్నులు, స్వీట్లు పంచిపెట్టారు. పుట్టినరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు 5 వేలకు పైగా మంది శ్రీనివాస్ రెడ్డి ఇంటికి చేరుకొని జన్మదిన శుభాకాంక్షలు తెలపడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

మరోవైపు ప్రత్యర్థుల గుండెల్లో గుబులు ప్రారంభమైనట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో పాటు శీనన్న కుటుంబంలోని సభ్యులందరూ ఒకే వేదికపై ఉండటం కుటుంబ ఐక్యతను గుర్తు చేస్తోంది. తాండూరు పట్టణంలోని ప్రధాన రోడ్లతో పాటు వార్డుల్లో ప్రత్యేక ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడం మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రాణంగా భావించే అభిమానులు వారి సేవలను గుర్తు చేస్తూ ప్రత్యేక పాటలను తయారు చేయడం మరో విశేషం. రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న ప్రజా ప్రతినిధులు, నేతలు కూడా శీనన్నకు ఫోన్ల ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ప్రజాబలంతో పాటు దైవబలం కూడా శీనన్నకు తోడుగా నిలిచింది.

## ఉప్పల్ కేకేఆర్ గార్డెన్‌లో ఘనంగా ఉపవాస విరమణ విందు

**ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి**



**ఉప్పల్, (జనంసాక్షి):** పవిత్ర రమజాన్ మాసం సందర్భంగా ఉప్పల్‌లోని కేకేఆర్ గార్డెన్‌లో ఘనంగా ఉపవాస విరమణ విందు కార్యక్రమం నిర్వహించారు. గంగా-జమునా సాంస్కృతిక స్ఫూర్తిని ప్రతిబింబించే విధంగా జె.బి సమూహం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఉప్పల్ శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, రాష్ట్ర మైనార్టీ నాయకులు బక్రుద్దీన్ , పలువురు నాయకులు పాల్గొన్నారు. ముస్లిం సోదరులు ఉపవాసం విరమించిన అనంతరం ప్రార్థనలు నిర్వహించి అందరూ కలిసి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ముస్లిం సోదరులకు పవిత్ర రమజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. రమజాన్ మాసం త్యాగం, సహనం, సేవా భావం , పరస్పర ప్రేమను పెంపొందించే పవిత్ర కాలమని ఆయన పేర్కొన్నారు. సమాజంలో సౌభ్రాతృత్వం, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. అలాగే భిన్న మతాలు, భిన్న సంప్రదాయాలు ఉన్నప్పటికీ అందరూ కలిసి జీవించడం భారత దేశ సాంస్కృతిక గొప్పతనమని ఆయన అన్నారు. ఈ తరహా ఉపవాస విరమణ విందులు సమాజంలో ఐక్యతను, స్నేహభావాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు, మైనార్టీ నాయకులు, స్థానిక నాయకులు, జె.బి సమూహ సభ్యులు , పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఉప్పల్ ప్రాంతానికి చెందిన ముస్లిం సోదరులు ,స్థానిక ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మత సమరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

**ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**



**తాండూరు (జనంసాక్షి):** మత సమరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో మైనార్టీ యువ నాయకుడు అమీర్ అబ్దుల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపవాసం పాటిస్తున్న ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొని,కి రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనో హర్ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం వరస్పర ప్రేమ, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు .కాంగ్రెస్ ప్రభుత్వం కుల, మతాలకు అతీతంగా ప్రజా పాలన అందిస్తుం దన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం లోని మైనార్టీల సంక్షేమంకోసం ముందుకు సాగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు పెద్ద మనస్సుతో ఆశీర్వాదించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మర్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, సురేందర్ రెడ్డి, నర్సిరెడ్డి, లొంక నర్సింలు,కర్ణం పురుషోత్తం, లింగదల్లి రవి ,సమీర్, వసీంతో పాటు పార్టీ నాయకులు , కార్యకర్తలు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## అగ్నిమాపక భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



**చేవెళ్ల, మార్చి 12 (జనంసాక్షి):** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పామెన శివారులో ఉన్న సంస్కృతి స్కూల్‌లో విద్యార్థులు, సిబ్బందికి అగ్నిమాపక భద్రతపై అవగాహన కల్పించేందుకు ఫైర్ సేఫ్టీ అవేర్‌నెస్ డెమో కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటిని ఎలా నివారించాలి అనే విషయాలను విద్యార్థు లకు వివరించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలకు కారణమయ్యే సాధారణ అంశాలు, వాటిని నివారించేందుకు పాటించాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో అగ్ని ఎలా అదుపులోకి తేవాలి, ఫైర్ సేఫ్టీ పరికరాలను ఎలా వినియోగించాలి అనే విషయాలపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. దీంతో విద్యార్థులు భద్రతా చర్యల ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని హెడ్ కానిస్టేబుల్ దస్తగిరి, కానిస్టేబుళ్లు ప్రశాంత్, గోపాల్, నరసింహ, శివకుమార్ నిర్వహించి విద్యార్థులకు ఉపయోగకరమైన భద్రతా సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఏ.శశిపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ రేహానా విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్సులో సుఖ ప్రసవం



**అబ్దుల్లాపూర్ మెట్, (జనంసాక్షి):** అబ్దుల్లాపూర్మెట్ మండలం గుంతపల్లి గ్రామానికి చెందిన లావణ్య (భర్త: శేఖర్) గురువారం ఉదయం 10:30 గంటల సమయంలో పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది తక్షణమే సంఘటన స్థలానికి చేరుకుని లావణ్యను ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్‌లో ఎక్కిం చారు. హయత్నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తు న్న సమయంలో మార్గమధ్యలోనే ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువగా రావడంతో అంబులెన్స్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు. మెడికల్ టెక్నీషియన్ దశరత్, పైలట్ చెరుకు శ్రీనివాస్ సహకారంతో అంబులెన్స్‌లోనే సురక్షితంగా నార్మల్ డెలివరీ నిర్వహించారు. దీంతో లావణ్య పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తదుపరి తల్లి ,శిశువును సమీపంలోని హయత్నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యుల పర్యవేక్షణలో అడ్మిట్ చేశారు. ప్రస్తుతం తల్లి, శిశువు ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు సమాచారం. అంబులెన్స్‌లోనే సుఖప్రసవం జరగడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ సిబ్బంది దశరత్ , చెరుకు శ్రీనివాస్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## నియమనిష్టలతో హనుమాన్ జీని కొలవాలి

**భక్తిశ్రద్ధలతో ప్రార్థిస్తే దుష్టశక్తులు దూరం**

**దీక్షా సమితి సభ్యులు మీదిపేట వినోద్ కుమార్**

**తాండూరు (జనంసాక్షి):** నియమ నిష్ఠలతో హనుమాన్ జిని కొలవాలని దీక్షా సమితి సభ్యులు మీదిపేట వినోద్ కుమార్ పేర్కొన్నారు. గురువారం తాండూర్ పట్టణంలోని హనుమాన్ దీక్ష సమితి ఆధ్వర్యంలో హనుమాన్ అర్థమండల దీక్ష ప్రారంభించారు. ఈ దీక్షలో దాదాపుగా 8 మందికి పైగా యువకులు దీక్ష తీసుకోవడం జరిగింది అలాగే బషీరాబాద్ మండలంలో 9 మందికి పైగా యువకులు హనుమాన్ దీక్షను చేపట్టారు. దీక్షా సమితి సభ్యులు మీదిపేట వినోద్ కుమార్ మాట్లాడుతూ హనుమంతుని మండల దీక్షలో అర్థం మండల దీక్షలు తీసుకోవడం ద్వారా స్వామి అనుగ్రహం తప్పక లభిస్తుందని తెలిపారు. దీక్ష తీసుకున్న యువకులందరూ కూడా నియమ నిష్టలతో స్వామి వారిని కోవవాలన్నారు. ఈ హనుమాన్ దీక్ష వచ్చే నెల హనుమాన్ దినోత్సవానికి దీక్ష పూర్తవుతుందని, నల్లమల్ల అడవుల్లో వెలిసిన పబ్బతి ఆంజనేయస్వామి మద్దిమడుగు క్షేత్రమైనటువంటి హనుమాన్ క్షేత్రానికి వెళ్లి అక్కడ పవన ముడి తో దీక్ష పూర్తవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్ష సమితి సభ్యులు యువకులు పాల్గొన్నారు.



## అనాజ్‌పూర్‌లో చెరువు ఎఫ్‌టిఎల్‌లో రహదారి నిర్మాణంపై సిపిఎం ఆందోళన



**అబ్దుల్లాపూర్ మెట్, (జనంసాక్షి):** అబ్దుల్లాపూర్ మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామ పరిధిలోని వేముల కత్తువ - ఇంద్రమ్మ సాగర్ చెరువు ఎఫ్‌టిఎల్ ప్రాంతంలో జీనియస్ రియల్ ఎస్టేట్ సంస్థ రహదారి నిర్మాణం చేపడుతున్నదని సిపిఎం పార్టీ ఆరోపించింది. గత ఆరు నెలలుగా ఈ అంశంపై ఆర్డీవో, కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసినప్పటికీ పనులు ఆగలేదని పార్టీ నాయకులు తెలిపారు. సిపిఎం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం చెరువు , పరిసర గుం టలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్‌టిఎల్ పరిధి లోనే సుమారు 100 మీటర్ల లోపల భారీగా రోడ్డు వేస్తూ గ్రానైట్ రాళ్లతో బేస్‌మెంట్ గోడలు కడుతున్నారని మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ ఆరోపించారు. ఈ విషయంపై జీనియస్ రియల్ ఎస్టేట్‌కు చెందిన శ్రీనివాసరావుతో ఫోన్‌లో మాట్లాడగా, ఇరిగేషన్ శాఖ నుంచి అనుమతులు తీసుకుని రైతుల సౌకర్యం కోసం తమ ఖర్చుతో రహదారి వేస్తున్నామని ఆయన చెప్పినట్లు తెలిపారు. అయితే ఎఫ్‌టిఎల్ ప్రాంతంలో రహదారి వేయమని రైతులు ఎవరూ అడగలేదని, మత్స్యకారుల పేరును చెప్పుకొని చెరువును నాశనం చేసే ప్రయత్నం జరుగుతోందని సిపిఎం నాయకులు విమర్శించారు. జీనియస్ విలాస్ పేరుతో సుమారు 300 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ చేపడుతూ చెరువులను ఆక్రమించి పర్యాటక కేంద్రాలుగా మలచాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు బ్లాస్టిం గ్‌కు సంబంధించిన అనుమతి తప్ప ఇతర అవస రమైన అనుమతులు - నాళా అనుమతి, హెచ్ఎం డిఏ అనుమతి - లేకుండానే కొండలను పిండుతున్నారని పేర్కొన్నారు. అధికార బలంతో చుట్టుపక్కల గ్రామాల నాయకులను ప్రలోభాలకు గురి చేస్తూ ప్రభుత్వ భూములను కూడా ఆక్రమించి భారీ రహదారులు వేస్తున్నారని ఆరోపించారు. వెంటనే అధికారులు స్పందించి చెరువులో జరుగుతున్న పనులను నిలిపివేయాలని, ఇరిగేషన్ శాఖ ఇచ్చిన అనుమతులను రద్దు చేసి చెరువులను రక్షించాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి చెరువులను రక్షించే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనాజ్‌పూర్ మాజీ ఉపసర్పంచ్ వర్కల బాలరాజ్, వర్కల ముత్యాలు, ఎలకపెల్లి మహేష్, కావలి జంగయ్య, సిపిఎం మండల నాయకులు జి.శివకుమార్, సత్యనారాయణ, మాలాద్రి, ప్రభాకర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# ఎన్‌పీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా గవ్వల భరత్ కుమార్

- యువతను రాజకీయాల్లోకి ఆహ్వానించాలని మేఘాలయ సీఎం సూచన



**ముషీరాబాద్, (జనంసాక్షి):** నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్పీపీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా గవ్వల భరత్ కుమార్‌ను పార్టీ జాతీయ నాయకత్వం నియమించింది. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాలకు ఇన్‌చార్జ్‌గా బాధ్య తలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఆయన సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా పార్టీని బలోపేతం చేసి యువతను రాజకీ యాల్లోకి ఆహ్వానించాలని పార్టీ జాతీయ అధ్యక్షులు మేఘాలయ సీఎం కొం్ౖరడాడ్ సంగ్మా సూచించారు. తెలంగాణలో పార్టీ కార్యకలా పాలను మరింత విస్తరించి ప్రజలకు చేరువ చేయడంలో గవ్వల భరత్ కుమార్ కీలక పాత్ర పోషిస్తారని పార్టీ నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువతను రాజకీయాల్లోకి తీసుకురావడంలో ఆయన చేసిన కృషి ప్రత్యేకంగా గుర్తింపు పొందింది. గవ్వల భరత్ కుమార్ గతంలో బీసీ జాతీయ సంక్షేమ సంఘంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. అలాగే బీసీ యువజన సంఘం, బీసీ విద్యార్థి సం ఘాల్లో నాయకత్వం వహిస్తూ బీసీ వర్గాల హక్కుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. యువత సమస్యలపై నిరంతరం స్పందిస్తూ పలు ఉద్యమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గవ్వల భరత్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకముంచి ఈ బాధ్యతలు అప్పగిం చిన నేషనల్ పీపుల్స్ పార్టీ జాతీయ అధ్యక్షులు, మేఘాలయ ముఖ్య మంత్రి కోన్‌రాడ్ సంగ్మా, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు జేమ్స్ సంగ్మా, జాతీయ ప్రధాన కార్యదర్శి పక్నా బాగే, జాతీయ యువజన సంఘం అధ్యక్షులు నీఖా నంక్ల తదితర నేతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. తెలంగాణలో పార్టీ అభివృద్ధి కోసం అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగుతామని, ముఖ్యంగా యువతను రాజకీయాల్లోకి తీసుకువచ్చి కొత్త నాయకత్వాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని గవ్వల భరత్ కుమార్ పేర్కొన్నారు.

ఈ నియామకంతో తెలంగాణలో నేషనల్ పీపుల్స్ పార్టీకి మరింత బలం చేకూరుతుందని పార్టీ నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ఉప్పల్ వైన్స్ వద్ద గంజాయి మత్తులో వ్యక్తి హల్‌చల్



**ఉప్పల్ (జనంసాక్షి):** బీరప్పగూడలోని శ్రీ విజయ దుర్గ వైన్ షాప్ వద్ద గంజాయి మత్తులో ఒక వ్యక్తి హల్‌చల్ చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మత్తులో ఉన్న ఆ వ్యక్తి అక్కడికి వచ్చిన వారిని భయాం దోళనలకు గురిచేసినట్లు స్థానికులు తెలిపారు. సాక్షుల వివరాల ప్రకారం, వైన్ షాప్ వద్దకు వచ్చిన ఆ వ్యక్తి గంజాయి మత్తులో అల్లరి చేస్తూ అక్కడున్న వారికి అసౌకర్యం కలిగించాడు. కొంతసేపు అక్కడే నిలబడి పెద్దగా అరుస్తూ, చుట్టుపక్కల ఉన్న వారిపై ఆగ్రహంగా ప్రవర్తించడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ఈ సమయంలో అక్కడే ఉన్న కొందరు యువకులు అతడిని శాంతింపజేయడానికి ప్రయత్నించినప్పటికీ, మత్తు కారణంగా అతను వినిపించుకోకపోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. దీంతో అక్కడున్న వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. మత్తులో హల్‌చల్ చేసిన వ్యక్తిని అక్కడి నుంచి పంపించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనతో కొంతసేపు వైన్ షాప్ పరిసర ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు. అలాగే ప్రజా ప్రాంతాల్లో మత్తు పదార్థాలు వినియోగిస్తూ అల్లర్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా డిమాండ్ చేస్తున్నారు.

# నిమ్స్‌కు నాణ్యమైన స్టీల్ వీల్ చైర్ల వితరణ

## దాతల సేవాభావం అభినందనీయమన్న నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప



**ఖైరతాబాద్, (జనంసాక్షి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, వెస్ట్ గోదావరి జిల్లా కేశవరానికి చెందిన వి.అశోక్ వర్మ-హారిక దంపతులు, నిమ్స్ రిటైర్డ్ ఎంప్లా యీస్ వెల్ఫేర్ అసోసియేషన్(నిమ్స్ రివా) సభ్యు డు టి.ఎన్.రామరాజు చేతుల మీదుగా నిమ్స్ ఆసుపత్రికి నాణ్యమైన స్టీల్ వీల్ చైర్లను విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప మాట్లాడుతూ రోగులకు ఆసుపత్రిలో సౌకర్యవంతమైన రవాణా కల్పించడంలో ఈ వీల్ చైర్లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.ఆ సుపత్రి అభివృద్ధికి తోడ్పడుతున్న దాతల సేవాభా వం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ ప్రొఫెసర్ రాకేష్, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్య గౌడ్, రిటైర్డ్ నర్సింగ్ ఆఫీసర్ బ్రాండి న పాల్గొన్నారు.

# విద్యార్థులు ఒత్తిడిని జయించి ముందుకు సాగాలి

**మర్పల్లి (జనంసాక్షి):** విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి, భవిష్యత్ దిశానిర్దేశమే లక్ష్యంగా వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం పలు అవగాహన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కెరీర్ గైడెన్స్, బాలికల సాధికారత, ఆదర్శ వ్యక్తులతో ముఖాముఖి, స్వీయ రక్షణ (సెల్ఫ్ డిఫెన్స్), మరియు యోగా తదితర అంశాలపై ఏర్పాటు చేసిన ఈ సదస్సులకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా లైఫ్ కోచ్, స్కిల్ ట్రైనర్ బి. నవీన్ కుమార్, సైకాలజిస్ట్ రామసాగరి, బి. సపంత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్న విద్యా అవకాశాలను ఎలా అందిపుచ్చుకోవాలి, సరైన కెరీర్‌ను ఎలా ఎంచుకోవాలి, ఆత్మవిశ్వాసాన్ని ఎలా పెంపొందించుకోవాలి అనే అంశాలపై విలువైన సూచనలు చేశారు. ముఖ్యంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు పరీక్షల పట్ల భయాన్ని పోగొట్టి, సమయపాలన పాటిస్తూ, ఒత్తిడిని జయించి ఉత్తమ ఫలితాలు ఎలా సాధించాలో వివరించారు. బాలికల సాధికారతపై ప్రత్యేక దృష్టి సారించిన నిపుణులు, సమాజంలో పాత్ర, నాయకత్వ లక్షణాలు, ధైర్యంగా ఎలా ముందుకు సాగాలో ఆదర్శ వ్యక్తుల ఉదాహరణలతో వివరించారు. ఈ సదస్సులో పాల్గొన్న పోలీస్ ఏఎస్ఐ విద్యార్థులకు పలు చట్టాలపై ప్రాథమిక అవగా హన కల్పించడంతో పాటు, ఆపద సమయంలో బాలికలకు ఉపయోగపడే స్వీయ రక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) మెలకువలను సూచించారు.విద్యార్థుల్లో శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొం దించేందుకు ప్రత్యే



కంగా యోగా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు కె.అంజిలయ్య తన వంతు సహకారంగా విద్యా ర్థులకు 100 యోగా మ్యాట్‌లను ఉచితంగా అందజేశారు. అనంతరం సదస్సుకు విచ్చేసిన ముఖ్య అతిథులను హెచ్‌ఎం అంజిలయ్యకు ఘనంగా సన్మానించి, మెమెంటోలు ప్రదానం చేశారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ కార్యక్రమం అందరి మన్ననలు పొందింది.

# విద్యార్థినిలు ఆరోగ్య రక్షణ పట్ల జాగ్రత్తలు పాటించాలి : డాక్టర్ భాగ్య లక్ష్మి



**శామీర్ పేట్, మార్చి 12(జనంసాక్షి):** శామీర్ పేట్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో గురువారం రోజు ప్రజా పాలనలో భాగంగా విద్యారనిలకు ఆరోగ్య అవ గాహన కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో డాక్టర్ భాగ్యలక్ష్మి కొన్ని విషయములపై మెన్స్ట్రువల్ హైజీన్, నెలసరి సమయంలో సరైన పరిశుభ్రత లేకపోతే వచ్చే సమస్యలు గురించి అవగాహన కల్పించారు. అలాగే సీజనల్ వ్యాధు లైన ప్రికాషనరీ మెజర్స్ అండ్ మేనేజ్మెంట్, న్యూ ట్రిషన్, ఫిజికల్ యాక్టివిటీ మరియు బాలెన్స్ డైట్ అనే అంశాలపై సెమినార్, పోస్టర్ ప్రజెంటేషన్ నిర్వహించారు.విద్యార్థినులు, చాలా చురుకుగా పాల్గొన్నారు. అధ్యాపకులు సుచరిత, రజిని వారి యొక్క అమూల్యమైన సందేహాన్ని విద్యార్థినిలకు అందించారు.ఈ కార్యక్రమంలో కళాశాలలోని విద్యార్థినిలు పాల్గొన్నారు.

# పది పరీక్షలకు సర్వం సిద్ధం

- సీసీ కెమెరాల నిఘాలో పరీక్షల నిర్వహణ
- పరీక్షా సమయం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు
- గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి
- ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు
- ఎంఈఓ నర్సింగ్ రావు



**పెద్దేముల (జనంసాక్షి):** పది పరీక్షలకు సర్వం సిద్ధం అని ఎంఈఓ నర్సింగ్ రావు అన్నారు, గురువారం పెద్దేముల్ మండల ఎమ్మార్సీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వెల్లడించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి నర్సింగరావు మాట్లాడుతూ.. ఈ నెల 14,నుండి ఏప్రిల్ 13,వరకు జరిగే పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పెద్దేముల్ మండలంలో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసామని తెలిపారు.పరీక్షలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.2025-2026 విద్యా సంవత్సరానికి పెద్దేముల్ మండల పరిధిలోని ప్రభుత్వ, పాఠశాలల నుండి మొత్తం 568 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరవుతు న్నట్లు తెలిపారు.568 విద్యార్థుల గాను మూడు సెంటర్లుగా ఏర్పాటు చేశామ న్నారు. జడ్.పి.హెచ్. బాయ్స్ స్కూల్‌లో 200,మంది విద్యా ర్థులు,రెండో సెంటర్‌గా జడ్.పి. హెచ్.ఎస్ గర్ల్స్ స్కూ ల్లో 188, విద్యార్థు లు మూడో సెంటర్ గా మంబాపూర్ జడ్. పి.హెచ్ .హెచ్.ఎస్ స్కూల్లో 180,మంది విద్యార్థులు పరీక్షల కు హాజరవుతు న్నట్లు, వెల్లడించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీరు, విద్యుత్, టేబుల్స్, బెంచీలు, అత్యవసర వైద్య సదుపాయాలు వంటి అన్ని వసతులు కల్పించినట్లు వెల్లడించారు. విద్యార్థులు తమ హాల్ టికెట్‌తో పరీక్ష కేంద్రం చిరునా మాను ముందుగానే తెలుసుకుని పరీక్ష సమయానికి ఒక గంట ముందు అక్కడికి చేరుకో వాలని సూచించారు.విద్యార్థులు ప్రశాంతంగా పరీ క్షలు రాసి మంచి మార్కులు సాధించి, స్కూలు కు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురా వాలని తెలిపారు.ఈ కేంద్రాల్లో పరీక్షల పర్యవేక్షణ కోసం 32 మంది ఇన్విజిలేటర్లను నియమిం చడంతోపాటు ప్రతి సెంటర్‌కు ఒక చీఫ్ సూపరిం టెండెంట్ డిపార్ట్మెంట్ ఆఫీసర్లను కేటాయించినట్లు తెలిపారు.

## దండుమైలారం పాఠశాల విద్యార్థులకు సైకిల్స్ ,బ్యాగ్ లు పంపిణీ

**ఇబ్రహీంపట్నం, (జనంసాక్షి):** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని దండుమైలారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు యూత్ ఫర్ సేవా సంస్థ అధ్వర్యంలో సైకిల్స్ , బ్యాగులు పంపిణీ చేయడం జరిగింది చేయడం జరిగింది.కార్యక్రమంకు ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా విద్యాధికారి సుశీంద్ర రావు హాజరై విద్యార్థులకు సైకిల్స్ మరియు బ్యాగ్ లు పాఠశాల విద్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంగా చదివి మంచి మార్కులతో పదవ తరగతి ఉత్తీర్ణత సాధించి గ్రామానికి మంచి పేరు తేవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ శోభ , ఉపాధ్యాయులు శ్రీనివాస్, రామకృష్ణ, వెంకట రమణ, శ్రీదేవి, నివేదిత, సులోచన, సుమలత, సుజాత, పుణ్యవతి, అనిత, రామేశ్వరి, విజయ, పూజరి రమేశ, విద్యార్థులు పాల్గొన్నారు.



# భూ భారతి చట్టంతో రైతులకు భద్రత

## తాండూర్ శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి



**పెద్దేముల్ (జనంసాక్షి) :** భూభారతి 2025 చట్టం రైతులకు భద్రత కల్పిస్తుందని తాండూర్ శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం పెద్దేముల్ మండలం గిర్మాపూర్ గ్రామంలో నిర్వహించిన భూభారతి సమగ్ర భూ సర్వే కార్యక్రమంలో పాల్గొని భూ భారతి చట్టం గురించి ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూభారతి చట్టంపై అవగాహన కల్పించి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.సర్వే జరుగుతున్న రైతు రాంరెడ్డి పొలాన్ని సందర్శించి, రైతులతో పాటు సర్వేయర్లతో నేరుగా మాట్లాడి సర్వే సమయంలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ప్రక్రియను స్వయంగా పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం, ధరణి స్థానంలో భూ భారతి వ్యవస్థను తీసుకవచ్చి, రైతులకు మేలు చేకూరే విధంగా ఉందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టించారని అన్నారు.రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే ఉద్దేశంతో అధికారులు గ్రామాలకే వచ్చి సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారని చెప్పారు. పట్టా సర్వే నెంబర్ స్థానంలో భూదార్ నెంబర్ ప్రవేశపెట్టబడుతుందని అన్నారు.అలాగే భూ సర్వేలో భాగంగా పట్టా భూమి, గ్రామకంఠం, ప్రభుత్వ భూములను స్పష్టంగా వేరు చేసి గుర్తించడం జరుగుతుందని తెలిపారు.ఈ సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ భూ భారతి చట్టం ద్వారా రైతులకు పారదర్శకమైన, సుస్థిరమైన భూ రికార్డు వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. సర్పంచ్ శివ రాం నాయక్, కోట్ పల్లి,మర్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్, నారాయణరెడ్డి,మండల డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాసులు. ఆర్ఐ,రిచర్డ్ సైమన్. కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సింలు,రాంరెడ్డి సర్వేర్ మహేష్ రైతులు పాల్గొన్నారు.

## బధిర విద్యార్థులకు అండగా ఉండటం అభినందనీయ




### దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య

**మల్కాజిగిరి (జనంసాక్షి):** దివ్యాంగ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదివి ఉన్నత శిఖరాల ను అధిరోహించాలని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య పిలుపునిచ్చారు.గురువారం నేరేడ్‌మెట్‌లోని హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల ప్రాంగణంలో 'సమూహ ఫౌండేషన్' ఆధ్వర్యంలో బధిర విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సేవా దృక్పథంతో దివ్యాంగ విద్యార్థులకు చేయూతనిస్తున్న సమూహ ఫౌండేషన్ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న బధిర విద్యార్థులందరికీ త్వరలోనే కార్పొరేషన్ తరపున ఉచితంగా ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేస్తామని వెల్లడించారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా విద్యార్థులు చదువులో రాణించి, సమాజంలో గౌరవప్రదమైన స్థానాల్లో నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల చైర్మన్ పఠాన్ ఉమర్ ఖాన్, ఎన్ పిఆర్ డి జాతీయ అధ్యక్షులు తు డుం రాజేందర్, విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబర్‌పేటలో రంజాన్ తోఫాలు పంచిన ఎమ్మెల్యే




**అంబర్‌పేట(జనంసాక్షి):** పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా అంబర్‌పేట నియోజకవర్గంలో ముస్లిం సోదరులకు రంజాన్ తోఫాలను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బుధవారం పంపిణీ చేశారు. అంబర్‌పేట డివిజన్‌లోని ఎన్.సి.హెచ్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ముస్లిం మహిళలు, కుటుంబాలకు అవసరమైన రంజాన్ తోఫాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ పండుగ ముస్లిం సమాజానికి ఎంతో పవిత్రమైనదని, ఉపవాస దీక్షలు ముగిసే ఈ పర్వదినాన్ని అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పేద ముస్లిం కుటుంబాలకు సహాయం అందిస్తూ వారి పండుగ సంతోషంగా జరగడానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేను స్థానికులు అభినందించారు.

## విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్ పంపిణీ చేసిన ముద్దగౌని మనీష్ గౌడ్

**హయత్ నగర్, మార్చి 12 (జనంసాక్షి):** వనస్థలిపురం లోని సాహెబ్ నగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎల్ బి నగర్ యువ నాయకులు ముద్దగౌని మనీష్ గౌడ్ పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్యాడ్లు, జామింట్రీ భాక్సులు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మనీష్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దినేష్, ఉపాధ్యాయులు, యువజన నాయకులు సామ సాయి, సంతోష్, ఆశీష్, జితేందర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## శాంతిభద్రతలను కాపాడేందుకు కృషి చేద్దాం

### మొయినాబాద్ సీఐ మల్లికార్జున్ రెడ్డి



**మొయినాబాద్,(జనంసాక్షి):** శాంతిభద్రతలలో అందరు కృషి చేద్దామని మొయినాబాద్ సీఐ మల్లికార్జున్ రెడ్డి అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు మోత్కుపల్లి రాములు, మోత్కుపల్లి సర్పంచ్ సంపూర్ణ, సర్దార్నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దారెడ్డి కృష్ణారెడ్డి, గ్రామస్తులతో కలిసి సీఐని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మొయినాబాద్‌కు సీఐగా రావడంతో ఆయనకు మోత్కుపల్లి గ్రామస్తులు, వార్డు సభ్యులు సన్మానించారు.

## పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్ పెన్నులు పంపిణీ



**మర్పల్లి మార్చి 12 (జనంసాక్షి):** రేపటి నుండి ప్రారంభం కానున్న 10 వ తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో రామేశ్వర్ అన్న యువసేన ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మర్పల్లి మండల కేంద్రంలో పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10 వ తరగతి విద్యార్థిని, విదార్థులకు రామేశ్వర్ అన్న యువసేన అధ్యక్షుడు బక్క మైపాల్ ఎగ్జామ్ ప్యాడ్స్ పెన్నులు గురువారం పంపిణీ చేయడం జరిగింది. అంతే కాకుండా రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలో పాఠశాలలో మొదటి స్థానం లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని విదార్థులకు రూ₹ 2500/-, రెండవ స్థానంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని విద్యార్థులకు రూ₹ 1000 ఇవ్వడం జరుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుభాష్ యాదవ్, ఉప సర్పంచ్ కోప్పుల ప్రభు, నర్సింలు యాదవ్, గొల్ల శేఖర్, వార్డు మెంబర్ గోపాల్ నాయక్, పసుల మారుతి, మెంబర్ పోలాస్ భారత్ కుమారు, యువ నాయకులు పబ్బే వసంత్, పాల్గొన్నారు.

## మొయినాబాద్ నూతన సిఐని సన్మానించిన కేతిరెడ్డిపల్లి గ్రామ ఉపసర్పంచ్



**మొయినాబాద్, (జనంసాక్షి):** మొయినాబాద్ సీఐగా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జున్ రెడ్డికి కేతిరెడ్డిపల్లి గ్రామ ఉపసర్పంచ్ వంశీ రెడ్డి గ్రామస్తులతో కలిసి సీఐని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మొయినాబాద్ కు సీఐగా రావడంతో కేతిరెడ్డిపల్లి వార్డు సభ్యులు, గ్రామస్తులతో కలిసి ఘనంగా శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సాయి రెడ్డి, శ్రీనివాస్, కేతిరెడ్డిపల్లి గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రెకాన్-26 సదస్సులో రియల్ ఎస్టేట్ భవిష్యత్ అవకాశాలపై చర్చ

**ఖైరతాబాద్, (జనంసాక్షి) :** మహా నగరం వేగవంతమైన విస్తరణతో నీరు, మురుగు నీటి సవాళ్లు పెరుగుతున్నాయని హెచ్ఎంఎడ బ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజింగ్ డైరెక్టర్, అశోక్ రెడ్డి ఐఏ ఎస్ అన్నారు. హైబిజ్ టీవీ, నారెడ్కో తెలంగాణ, హైదరాబాద్ రియల్టర్స్ అసోసియేషన్ సంయు క్తంగా నిర్వహించిన హైదరాబాద్ రియల్ ఎస్టేట్ కాన్‌క్లేవ్-హైడ్రెకాన్-2026 సదస్సులో అశోక్ రెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న నగర అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం రూ.7,300 కోట్ల వ్యయంతో గోదావరి ఫేజ్-2, ఫేజ్-3 ప్రాజెక్టులను చేపట్టిందని, వీటి ద్వారా నగరంలో తాగునీటి సరఫరా మెరుగుపడుతుందని తెలిపారు. ప్రధాన అతిథులుగా సీఐఐ ఐజీబీసీ జాతీయ చైర్మన్ శేఖర్ రెడ్డి, క్రెడై జాతీయ అధ్యక్షుడు జి.రామ్ రెడ్డి, క్రెడై హైదరాబా ద్ తక్షణ మాజీ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి పాల్గొని మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, రియల్ ఎస్టేట్ రంగం లోని భవిష్యత్ అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధి, సాంకేతిక వినియోగం అలాగే 'షీ బిల్డ్స్, షీ లీడ్స్' అనే ప్రత్యేక సెషన్‌లో మహిళల పెరుగు తున్న నాయకత్వ పాత్రపై చర్చించారు. నిర్వాహకులు నారెడ్కో తెలంగాణ అధ్యక్షుడు విజయ్ సాయి మేకా, జనరల్ సెక్రటరీ శ్రీధర్ రెడ్డి, హైబిజ్ వన్ ఎల్ఎల్‌పి ఎండీ డా.జె.సంధ్యా రాణి, హైబిజ్ టీవీ ఎండీ ఎం.రాజ్ గోపాల్ పాల్గొన్నారు.



### మార్చి 17న చేతి వృత్తిదారుల మహాధర్నాను

# జయప్రదం చేయాలని పోస్టర్ ను ఆవిష్కరించిన

**చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ**



**హయత్ నగర్, (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2026-27 సం.లో ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో చేతి వృత్తిదారుల సంక్షేమానికి 25 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని, గత బడ్జెట్‌లో కేటాయి ంచిన నిధులు మార్చి చివరి వరకు మొత్తం ఖర్చు పెట్టాలని, సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ యం.వి. రమణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిసాలగడ్డ లోని వృత్తిదారుల భవనంలో చేతి వృత్తిదారుల మహాధర్నా పోస్టర్ ను మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అమరావతీ, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి వెంకట నరసయ్య, విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాళ్ల బండి కుమారస్వామి, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళి, కార్యదర్శి యం.నరహరి, క్షౌర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేశం, రజక వృత్తిదారుల సంఘం హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు లొంక సోమయ్య లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన హామీలు అమలు చేయాడం లేదు, ప్రతి సంవత్సరం బడ్జెట్లో 25 వేల కోట్ల నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడం బాధాకరం అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తిదారుల రాష్ట్ర కార్పొరేషన్, ఫెడరేషన్ లకు గత సంవత్సరం బడ్జెట్ లో కేటాయింపులే తక్కువ ఉన్నాయని అవి కూడా ఖర్చు చేయలేదని వారు అన్నారు. ఈ సంస్థలు పేరుకు మాత్రమే ఉన్నాయని, వీటికి నిధులు విధులు ఎలాంటి కేటాయింపులు లేవని, వీటితో వృత్తిదారులకు ఎలాంటి ఉపయోగం జరగడం లేదని వారు తెలిపారు. కేటాయించిన 1018 కోట్లు ఈనెల చివరి వరకు విడుదల చేసి ఖర్చు చేయాలని, 2026-27 బడ్జెట్ లో వృత్తిదారుల సంక్షేమానికి 25 వేల కోట్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. బీసీ సబ్ ప్లాన్ చట్టం చేయాలని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలని, వర్గీకరణ చేయాలని, వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మార్చి 17వ తేదీన ఇందిరా పార్క్ వద్ద జరిగే వృత్తిదారుల మహా ధర్నాకు కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, గొర్రెలు, మేకల పెంపకం దారులు, రజక వృత్తిదారులు, విశ్వకర్మ వృత్తిదారులు వడ్రంగి, ఇనుము పని, బంగారం, ఇత్తడి, శిల్పాలు చెక్కుట, క్షౌర వృత్తిదారులు, మేదర, దూదేకుల, కుమ్మరి, దాసరి, సగర, ఉప్పర, బట్రాజులు, బోయ, పూసల, టైలర్, బ్యాండు, వాయిద్య, ఒగ్గు, మందహెచ్చుల, దుబ్బుల కొలుపు, పడపోత్ర, గంగిరెద్దుల, జెట్టి, ఏనూటి, తదితర సాంస్కృతిక వృత్తులవారు హాజరై, విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# బడికి వెళ్లే పిల్లలకుబస్సులు వేయండి సార్లు



**నవాబుపేట్ (జనంసాక్షి):** నవాబ్ పేట మండల పరిధిలోని విద్యార్థిని విద్యార్థులు విద్యాభ్యాసాన్ని అందిపుచ్చుకోవడానికి ఎన్నో అసలు కష్టాలు పడుతున్న సందర్భంగా చదువుకొని లక్ష్యాలను ఎంచుకొని అనుకున్న లక్ష్యాన్ని సాధించుకోవడానికి వెళ్ళుదామంటే గంగ్యాడ , పూలపల్లి , నారేగూడ , సిద్దు లూర్, గ్రామాలకి బస్ సౌకర్యం లేనందున విద్యార్థులకు , రైతులకు , ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వికారాబాద్ నుండి సిద్దలూర్ వయా గంగ్యాడ బస్ ను గతంలో మాదిరిగా నడపాలని ఆయా గ్రామ సర్పంచ్‌లు భీమ్ భరత్‌ని సంప్రదించగా వారు తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రివర్యులు , బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేసిన చేవెళ్ళ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ ఈ కార్యక్రమంలో వీరితో పాటుగా పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్ చేవెళ్ల అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ నాయకులు భానూరి ఉపేందర్ రెడ్డి,పూల పల్లి గ్రామ నాయకులు ఏలిమేల మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పాపయ్య, బుచ్చయ్య, నారేగూడ నాయకులు దశరత్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, విష్ణువర్ధన్ రెడ్డి, నాగేందర్ నారేగూడ సర్పంచ్ దశరథ్ , పూలపల్లి శ్రీనివాస్ రెడ్డి , మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే "ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక"

## తెలంగాణ, బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్




**హైదరాబాద్, మార్చి 12 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన" ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక" జూన్ 12 వరకు కొనసాగుతుందని, ప్రభుత్వం నిర్దేశించిన అన్ని కార్యక్రమాలను జయప్రదం చేయాలని, తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతీ శ్రీకాంత్ గౌడ్ అధికారులను కోరారు. గురువారం నాడు, దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్, బీసీ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం అందులో ఒక భాగం అని అన్నారు 99 రోజుల కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అందరినీ భాగస్వాములను చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని, ప్రతిరోజు పార్కులకు వచ్చే వాకర్లు ఈ ప్రత్యేక పరిశుభ్ర కార్యక్రమంలో భాగస్వాములను చేసేందుకు అధికారులు కృషి చేయాలని అన్నారు. మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

**పారిశుద్ధ్యానికి మొదటి ప్రాధాన్యం**

వేసవి ప్రారంభమైందని, దీనితో పాటు దోమల బెడద కూడా ప్రారంభమైంది కావున పారిశుద్ధ్య కార్యక్రమానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. రోడ్ల శుభ్రం, డ్రైన్ల శుభ్రం, అంగన్ వాడిలు, మార్కెట్లు, హాస్టళ్ళు, బస్టాండ్లలో శుభ్రత, రోడ్ల వెంట ఖాళీ ప్రదేశాలలో చెట్లపొదలు తొలగింపు, వంటి పనులు ఇందులో భాగం గా ఉంటాయని అన్నారు. రెవిన్యూ ఆగ్ మెంటేషన్ కింద కొత్త ఇండ్లు, పరిశ్రమలు, కమర్షియల్ భవనాల అసెస్మెంట్, ట్రేడ్ లైసెన్స్ జారీ, మార్కెట్లు షాపింగ్ కాంప్లెక్స్ వేలం పూర్తి 100% టాక్స్ ల వసూళ్లు ఇతర ఫీజులు వసూళ్ళు, 2026- 27 సంవత్సరానికి టాక్సు నిర్ధారణ,పంచాయతీలు, అంగన్ వాడీ భవనాలు, సిసి రోడ్ల నిర్మాణం వంటి పనులు, చేపడతారని వివరించారు. తాగునీటికి సంబంధించిన పైపుల రిపేర్, పైపులతో కొత్త కనెక్షన్లు వంటివి గుర్తింపు వాటి రిపేర్లు కొత్త కనెక్షన్లకు మెటీరియల్ సేకరణపై కార్యాచరణ ప్రణాళిక, అధికారులు తయారు చేస్తారని పంచాయతీ నిధులు 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం ఇతర వనరుల గుర్తింపు పూర్తి చేస్తారని అన్నారు. అన్ని ఇళ్లలో ద్రవ, ఘన, వ్యర్థాలను విడదీసి సేకరించే పని ప్రతి గ్రామ పంచాయతిది అని కంపోస్టు ఎరువు తయారీ వరద నిర్వహణ పద్ధతులపై శిక్షణ, ఈ వేస్ట్, బయో మెడికల్ వేస్ట్, శానిటరీ వేస్ట్, సేకరణ సురక్షితంగా డిస్పోజ్ చేయడం ద్రవ్య వ్యర్థాల నిర్వహణ చర్యలు కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్సు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ల వంటి వాటిని చేపడుతారని పేర్కొన్నారు. ఉపాధి హామీ అమలు తీరు చేపట్టిన పనులను పరిశీలిస్తారని వర్షాకాల సన్నద్ధతలో భాగంగా వరద నీటి కాలువల డిసిల్టింగ్, లోతట్టు ప్రాంతాల ఫీలింగ్ యాంటీ లార్వా కెమికల్స్, ఫాగింగ్ స్ప్రే, శుక్రవారం డ్రై డే పాటింపు, ఉపాధి హామీ కింద మొక్కల పెంపకం, వాటికోసం స్థలాల గుర్తింపు,మొక్కలు నాటడం వంటి పనులు చెయ్యాలని అన్నారు. నూతి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి అనూహ్య స్పందన లభించింది. బీసీ కార్పొరేషన్ కు సంబంధించిన అన్ని పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయాలని, అందుకు కావలసిన కార్యాచరణను రూపొందించుకోవాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో బీసీ కమిషనర్ బాలమాయాదేవి, ఎండి మల్లయ్య భట్టు, సీఈఓ అలోక్ కుమార్, ఎండిలు ఉదయ్ ప్రకాష్, ఇందిరా, శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల శ్రేయస్ కోసమే బోరుబావి

- 36వ వార్డులో తీరిన తాగునీటి కష్టాలు
- ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి



**తాండూరు (జనంసాక్షి)** వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల శ్రేయస్సు కోసం బోరుబావిని వేయించినట్లు ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాసరెడ్డి తెలిపారు.గురువారం తాండూర్ మున్సిపల్ పరిధిలోని 36వ వార్డు ప్రజల తాగునీటి సౌకర్యం కోసం కాంగ్రెస్ నాయకుడు కల్వ రాజా వంశీ స్వంత డబ్బులతో బోర్ వేయిస్తున్న సందర్భంగా తాండూర్ మున్సి పల్ ఛైర్పర్సన్ నీరజా బాల్ రెడ్డితో కలిసి ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యానీ శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు.ఈ సంద ర్భంగా ఆర్బీఓఎల్ సీఈఓ,కాంగ్రెస్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్య లపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిం చేందుకు కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## చికిత్స పొందుతున్న వ్యక్తిని పరామర్శించిన నాయకులు



**తలకొండపల్లి (జనంసాక్షి):** తలకొండపల్లి మండలం రాంపూర్ పంచాయతీ పరిధిలోని సంగాయిపల్లి గ్రామానికి చెందిన తాడెం నరేష్ మంగళవారం మిడ్జిల్ నుండి వెల్జాల్ వచ్చే దారిలో అడవి పందుల అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో బైకు అదుపుతప్పి రోడ్డుపై పడడంతో తీవ్రంగా గాయపడ్డారు.రోడ్డు ప్రమాదంలో భుజం,కుడిచేతి ఫ్యాక్చర్ అవ్వడంతో మహబూబ్‌నగర్ లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న సంగాయి పల్లి బిఆర్ఎస్ యువ నాయకులు పబ్బ సంపత్ కుమార్,రాంపూర్ 8వ వార్డు సభ్యులు కాకి రామచంద్రయ్య,లు గురువారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తాడెం నరేష్,ను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు.బిఆర్ఎస్ పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించారు.

# ఇందిరమ్మ రాజ్యంలోనే పేదింటి కల నెరవేరింది - భీమ్ భరత్

## ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన: చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్..!!

**నవాబుపేట్ మార్చి 12 ( జనంసాక్షి):** నవాబ్ పెట్ మండల పరిధిలో తిమ్మారెడ్డి పల్లీ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన సందర్భంగా ఇంటి నిర్మాణం పూర్తి కావడంతో ప్రభుత్వము మంజూరు చేసిన ఇంటి నిర్మాణానికి ఆరు లక్షల రూపాయలు విడుదల చేశారు 6.లక్షలను నాలుగు విడతలుగా బిల్లులు మంజూరు కావడంలో ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశారు. నిర్మించిన గత కొన్ని సంవత్సరాల నుండి ఇందిర మ్మ ఇండ్లను మంజూరు చేసిన ఘనత ఎలక్షన్ మూామెంట్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేసిందని ఇచ్చిన మాటకుదానికి అనుగుణంగా గురువారం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చి న ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి కావడంతో చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ ఆధ్వర్యంలో తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన చాకలి మంగమ్మ రమేష్, ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసినరూ ఈ సందర్భంగా చేవెళ్ల కాంసెస్సీ ఇన్చార్జి పామిన భీమ్ భారత్ ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాడైనా ఏనాడైనా పేదల పక్షాన ఉంటుందని పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని మేనిఫెస్టో లో ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లను మంజూరు చేస్తూ పేదల పక్షాన దేవునిలా నిలబడి పేదల కోసం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నవాబ్ పెట్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేడిపల్లివెంకటయ్య మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్ రెడ్డి , ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, రాష్ట్రయూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ గణపురం ప్రసాద్ కుమార్, యాదయ్య మొయినాబాద్ మండలం అధ్యక్షులు మానయ్య , నవాబుపేట్ మండలం మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కర్ణం రఘు , ఎల్వర్తి సర్పంచ్ దశరథ్ , తిమ్మారెడ్డిపల్లి స్థానిక సర్పంచ్



అనంతగిరిపల్లి ప్రభాకర్ , ఉప సర్పంచ్ మల్లేష్ , నవాబుపేట్ సర్పంచ్ గాజులగుడం నరసింహ రెడ్డి, యావపూర్ మంగలి శివ నేల,సికిందర్ రెడ్డి , వార్డు సభ్యులు ,గ్రామ కమిటీ అధ్యక్షులు ఇందిరమ్మ కమిటీ మెంబెర్స్ సీనియర్ నాయకులు , స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు , ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలకు భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టం... సిపి డాక్టర్ ఎం రమేష్



**శేరిలింగంపల్లి, మార్చి 12 (జనంసాక్షి) :** ఈనెల 14వ తేదీ నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు సైబరాబాద్ పోలీస్ అధికారులు ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. ఈ సందర్భంగా గురువారం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం రమేష్ మాట్లాడారు. నెల రోజులకు పైగా వ్యవధిలో నిర్వహించ తలపెట్టిన 10వ తరగతి పరీక్షలకు సంబంధించి సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రత, సిసి కెమెరాలు నిఘాను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలులోకి వస్తున్నందున పరీక్షా కేంద్రానికి కనీసం 200 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి ప్రజలు గుమికూడదని, 100 మీటర్ల పరిధిలో ఎలాంటి జిరాక్స్ కేంద్రాలు, ఇంటర్నెట్ షాపులు తెరిచి ఉంచకూడదని సిపి ఆదేశాలు జారీ చేశారు. సెక్షన్ 163వ నిబంధన ప్రకారం ఈనెల 14 ఉదయం 6 గంట ల నుండి ఏప్రిల్ 16 సాయంత్రం 6 గంటల వరకు నిబంధనలన్నీ అమ లులో ఉంటాయని, ప్రజలు తప్పకుండా సహకరించి ప్రశాంత వాతా వర ణంలో పరీక్షలు ముగిసేలా సహకరించాల్సిన బాధ్యతను గుర్తు చేశారు.

## బిజెపి రాష్ట్ర ప్రొఫెషనల్ సెల్ కన్వీనర్‌గా బాల్ద అశోక్



**శేరిలింగంపల్లి, (జనంసాక్షి) :** భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, అఖిలభారత కనీస వేతన సంఘం మాజీ సభ్యులు , రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నేతృత్వంలో ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన బాల్ద అశోక్ బిజెపి రాష్ట్ర ప్రొఫెషనల్ సెల్ కన్వీనర్ గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో సంఘటిత, అసంఘటిత రంగాలతో పాటు ఇతర రంగాలలో ఉన్న ప్రొఫెషనల్స్ కు భారత ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించి శేరిలింగంపల్లి ప్రజలను, ఆయా రంగాల కార్మికులను, ప్రొఫెషనల్స్ ను భారతీయ జనతా పార్టీలోకి ఆహ్వానిస్తానని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రొఫెషనల్స్ ని బిజెపి వైపు అడుగులు వేయించి పార్టీ నిర్మాణంలో, వారి వ్యక్తిగత జీవితాల అభివృద్ధిలో తన వంతు క్రియాశీల పాత్రను పోషిస్తానని ఆయన భరోసాని వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన బిజెపి రాష్ట్ర జాతీయ నాయక త్వానికి బాల్ద అశోక్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ



**శామీర్ పేట్, మార్చి 12 (జనంసాక్షి):** మూడుచింతల పల్లి మున్సిపాలిటీ పొన్నాల్, కేశ్వపూర్ వార్డులల్లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 12వ వార్డ్ కౌన్సిలర్ మ్యాడబోయిన మౌనిక శివ వీర ప్రసాద్, కేశ్వపూర్ 20 వార్డు కౌన్సిలర్ గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు అవసరమైన పరీక్ష సామగ్రి ప్యాడు , జామెంట్రీ బాక్స్ , పెన్నులు , స్కేల్ , వాటర్ బాటిల్స్ అందజేశారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాల ఛైర్మెన్ అజయలక్ష్మి, 11వ వార్డ్ కౌన్సిలర్ కొలాసు రాజు, మున్సి పాలిటీ నాయకులు సతీష్ రెడ్డి,బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు పిట్టల రమేష్, మాజీ వార్డు మెంబర్ శివ శంకర్, నాయకులు తలారి క్రిష్ణ మైనబో యిన పాపయ్య మైనబోయిన బాలరాజు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ



**చేవెళ్ల, మార్చి 12 (జనంసాక్షి):** రాబోయే పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామానికి మంచి పేరు తీసుకురా వాలని బిఆర్ఎస్ మండల పార్టీ కార్యదర్శి ఊరడి రాంప్రసాద్ ఆకాంక్షించారు. చేవెళ్ల మున్సిపల్ ఊరెళ్ళ వార్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షల కోసం అవసరమైన ప్యాడ్లు, పెన్నులు, స్టేషనరీ సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ...ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పబ్లిక్ పరీక్షలను ధైర్యంగా రాసి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉత్తేజపరిచారు. ఈ సహకారం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ఇలియాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహమ్మద్ అక్బర్, కృష్ణ, ప్రకాశ్ రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సబర్మతి నగర్‌లో ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ చేసిన ఎమ్మెల్యే ముఠా గోపాల్



**ముషీరాబాద్, మార్చ్ 12 (జనంసాక్షి):** రంజాన్ పండుగ ను పురస్కరించుకుని ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్ సబర్మతి నగర్‌లో ముస్లిం సోదరులకు గురువారం గురువారం రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముషీరాబాద్ శాసన సభ్యు లు ముఠా గోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు శు భాకాంక్షలు తెలియజేసి రంజాన్ తోఫా ప్యాకెట్లను పంపిణీ చేశారు. ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ అధ్యక్షు లు ముడారపు రాకేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి పోతుల శ్రీకాంత్, ముఠా నరేష్, పున్నసత్యనారాయణ, శ్రీనివాస్ గుప్త, ముచ్చకుర్తి ప్రభాకర్,జి వై గిరి, హెచ్ హనుమంతు,ఎం డి గౌస్ భాయ్,బి కిరణ్ కుమార్, యాదగిరి,లక్ష్మణ్, రచ్చ నరేష్,ఈ రవిశంకర్ గుప్త,కుమార స్వామి శివకుమారి,పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతులకు న్యాయం చేయాలి : సత్తు సింహాద్రి రెడ్డి



**ఇబ్రహీంపట్నం, (జనంసాక్షి):** యాసంగి పంట సీజన్ ముగియడానికి ఇం కా కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉన్నప్పటికీ రైతు భరోసా నిధులను ఇప్పటికీ ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని తులేకలాన్ గ్రామ వార్డు సభ్యులు సత్తు సింహాద్రి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు సంవత్సరానికి మూడు పంటలకు “రైతు భరోసా” అందిస్తామని హామీ ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. అయితే అధికారం లోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు రెండు సంవత్సరాల కాలంలో కేవలం ఒక్కసారి మాత్రమే రైతులకు ఆర్థిక సాయం విడుదల చేయడం రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపుతున్నట్లు ఉందని ఆయన ఆరోపించారు. గతంలో ముఖ్య మంత్రిగా ఉన్న కెసిఆర్ రైతుల సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకుని రైతు బంధు పథకాన్ని సమయానికి అమలు చేసి తెలంగాణను దేశానికి ఆదర్శ ంగా నిలిపారని ఆయన తెలిపారు. కెసిఆర్ గారు రైతులు విత్తనాలు, ఎరు వులు కొనుగోలు చేసే సమయంలోనే నిధులు అందేలా చేసి వ్యవసా యాన్ని బలోపేతం చేసిన విషయం ఇప్పటికీ రైతులు గుర్తు చేసుకుం టున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి వెంటనే స్పందించి రైతు భరోసా నిధు లను తక్షణమే విడుదల చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ముస్లిం కుటుంబాలకు ఈద్‌కా తోఫాల పంపిణీలో పాల్గొన్న హనుమంత్ రెడ్డి



**నిజాంపేట్ మార్చి 12 (జనంసాక్షి):** పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ముస్లిం సోదరులకు తోడ్పాటు అందిం చేందుకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న “ఈద్ కా తోఫా” (రం జాన్ కానుక) పథకం పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగి ంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రగతి నగర్‌లోని మసీద్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లికుత్బు ల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి హాజరై మసీదుల ద్వారా అర్హులైన ముస్లిం కుటుంబాలకు ఈద్ కా తోఫా లు దుస్తులు ఇతర నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భం గా హన్మంతన్న మాట్లాడుతూ, రంజాన్ పండుగ సోదరభావం, సహనం సేవా భావానికి ప్రతీక అని అన్నారు. పేద అవసరమైన కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈద్ కా తోఫా పథకం వారికి ఎంతో ఉపయుక్తం గా ఉంటుందని తెలిపారు. ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుధీర్ రెడ్డి, మహమ్మద్ నబి , వాసు, మెడ శ్రీను, రమేష్, నారాయణ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్, రఫియా బేగం, బికాంషా, సురేందర్ రెడ్డి, అరవింద్, రవీందర్, తులసి దాస్, ఆది రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, ఏ.వి రెడ్డి పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షకు వెళ్తూ ఇద్దరి మృతి

**మృతుల కుటుంబాలను పరామర్శించిన క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి**







**రాజేంద్రనగర్, (జనంసాక్షి):** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కొత్తూరు గ్రామం మండలం, రంగారెడ్డి జిల్లా నివాసులు విక్కి సింగ్ (22), సూరజ్ (17) ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాయడానికి బైక్‌పై కొత్తూరు నుంచి శంషాబాద్‌కు బయలుదేరారు. ఉదయం సుమారు 7:40 గంటల సమయంలో ఎన్‌హెచ్-44 రోడ్డుపై మదనపల్లి పాత తాండా గ్రామ పరిధి లోకి చేరుకున్నప్పుడు, గుర్తు తెలియని వాహనం డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి బైక్‌ను వెనుక నుండి ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయగా, అదే వాహనం వారిపై నుంచి వెళ్లడంతో విక్కి సింగ్, సూరజ్ ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన వాహనం డ్రైవర్ వాహనంతో అక్కడి నుంచి ఆపకుండా పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు శంషాబాద్ ఇన్స్పెక్టర్ కె. నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన క్రీడాశాఖ మంత్రి మృతుల కుటుంబాలను పరామర్శించి, అంత్యక్రియల నిర్వహణకు ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

## యువతకు సివిల్ డిఫెన్స్ వాలంటీర్ శిక్షణ ప్రారంభం

### అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేలా యువతకు శిక్షణ




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 12 (జనంసాక్షి):** తెలంగాణ అగ్నిమాపక, విపత్తు ప్రతిస్పందన, అత్యవసర సేవలు మరియు పౌర రక్షణ శాఖ ఆధ్వర్యంలో యువతను అత్యవసర పరిస్థితుల్లో తొలి స్పందనకర్తలుగా తీర్చిదిద్దేందుకు పౌర రక్షణ స్వచ్ఛంద సేవకుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమం మార్చి 12 నుంచి మార్చి 17 వరకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు. వెంకటాపూర్‌లోని నీలిమ వైద్య విజ్ఞాన సంస్థలో గురువారం జరిగిన కార్యక్రమాన్ని ఆ సంస్థ డీన్ డాక్టర్ లక్ష్మీ ప్రసన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించడంలో స్వచ్ఛంద సేవకుల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. గగన దాడులు, రసాయన దాడులు, అణు ప్రమాదాలు మరియు ఇతర విపత్తుల సమయంలో ప్రభుత్వ శాఖలకు స్వచ్ఛంద సేవకుల సహాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణలో పాల్గొనే వారికి రక్షణ చర్యలు, అగ్ని ప్రమాదాల నియంత్రణ, ప్రథమ చికిత్స, జన సమూహ నియంత్రణ, సహాయక సామగ్రి పంపిణీ వంటి అంశాలలో శిక్షణ అందించనున్నారు. శిక్షణ పొందిన స్వచ్ఛంద సేవకులు పోలీసు, అగ్నిమాపక శాఖ ఇతర అత్యవసర సేవా విభాగాలతో సమన్వయంతో పనిచేయనున్నారు. తెలంగాణ అగ్నిమాపక, విపత్తు ప్రతిస్పందన, అత్యవసర సేవలు , పౌర రక్షణ శాఖ ప్రధాన అధికారి విక్రమ్ సింగ్ మాన్ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అత్య వసర పరిస్థితుల్లో స్వచ్ఛంద సేవకుల సహకారం ప్రాణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అగ్ని మాపక అధికారి జిల్లా అగ్నిమాపక అధికారి పి. జయకృష్ణ, నీలిమ వైద్య విజ్ఞాన సంస్థ డీన్ డాక్టర్ లక్ష్మీ ప్రసన్నతో పాటు అగ్నిమాపక శాఖకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో అభివృద్ధి పథంలో మంచాల మండలం



**ఇబ్రహీంపట్నం, (జనంసాక్షి):** తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల్లో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని మంచాల మండల అభివృద్ధికై ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అధిక నిధులు తీసుకొచ్చి పనులు చేయిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణు వర్ధన్ రెడ్డి అన్నారు. తాజాగా మండలంలోని ఆరుట్ల గ్రామానికి 90 లక్షలు, లోయపల్లి గ్రామానికి 50 లక్షలు, నోముల 50 లక్షలు, తిప్పాయిగూడ 25 లక్షలు, ఎల్లమ్మతండా 25 లక్షలు, రంగాపూర్ 25 లక్షలు, లింగంపల్లి 75 లక్షలు, బండలేమూరు 25 లక్షలు, జాపాల 50 లక్షలు, కాగజ్ ఘాట్ 25 లక్షలు, ఆగాపల్లి 25 లక్షలు, దాద్ పల్లి 25 లక్షలు, చెన్నారెడ్డి గూడ 20 లక్షలు, చిత్తాపూర్ 20లక్షలు, మొత్తం 5.30 కోట్లు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో హెచ్ఎండిఏ నిధుల నుండి మంజూరైనట్లు తెలిపారు. త్వరలో మంచాల మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు డ్రైనేజీ వీధిలైట్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించడానికి మరిన్ని నిధులు రాబోతున్నాయని అన్నారు. మంచాల మండల అభివృద్ధికి కంకణబద్ధులై అధిక నిధులు కేటాయించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి మండల ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు.

### నాలా పునర్నిర్మాణ

## పనుల దృశ్యా దారి మళ్లింపు

**ముషీరాబాద్, (జనంసాక్షి):** అశోక్ నగర్ సమీపంలోని అరవింద్ నగర్ వద్ద హుస్సేన్ సాగర్ సర్ప్లస్ నాలా వంతెన కూల్చివేత, పునర్నిర్మాణ పనుల దృష్ట్యా, నేటి నుండి ట్రాఫిక్ మళ్లింపులు జరుగుతాయి. నాయని నరసింహారెడ్డి స్టీల్ బ్రిడ్జి కింద ఉన్న పిల్లర్ నెం. 16 నుండి 17 మధ్య రహదారుల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రయాణికులు తమ ప్రయాణాన్ని ముందుగానే ప్లాన్ చేసుకోవాలని గాంధీ నగర్ ట్రాఫిక్ పోలీసులు సూచించారు. రద్దీని నివారించడానికి ఈ క్రింది ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు ప్రత్యామ్నాయ మార్గాలు:

1. హిమాయత్ నగర్ స్ట్రీట్ నెం: 9 నుండి ఇందిరా పార్క్ ఎక్స్ రోడ్ వైపు వెళ్లే వాహనాలు (ద్విచక్ర వాహనాలు మినహా), అశోక్ నగర్ ఎక్స్ రోడ్ వద్ద మళ్లించబడతాయి. ఇవి అశోక్ నగర్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం - బాకారం బ్రిడ్జి - ఎల్ఐసి కాలనీ - బండమైసమ్మ ఎక్స్ రోడ్ - ధర్నా చౌక్ మార్గ మీదుగా ఇందిరా పార్క్ ఎక్స్ రోడ్‌కు చేరుకోవాలి.
2. ఆర్టీసీ ఎక్స్ రోడ్ నుండి ఇందిరా పార్క్ ఎక్స్ రోడ్ వైపు వెళ్లే వాహనాలు (ద్విచక్ర వాహనాలు మినహా), అశోక్ నగర్ ఎక్స్ రోడ్ వద్ద మళ్లించబడతాయి. ఇవి అశోక్ నగర్ సబ్-రిజిస్ట్రార్ కార్యాల యం - బాకారం బ్రిడ్జి - ఎల్ఐసి కాలనీ - బండమైసమ్మ ఎక్స్ రోడ్ - ధర్నాచౌక్ మార్గ మీదుగా ఇందిరా పార్క్ ఎక్స్ రోడ్‌కు చేరుకోవాలి.
3. బాకారం నుండి ఇందిరా పార్క్ ఎక్స్ రోడ్ వైపు వెళ్లే వాహనాలు (ద్విచక్ర వాహనాలు మినహా), బాకారం బ్రిడ్జి వద్ద మళ్లించబడతాయి. ఇవి కుడి వైపుకు తిరిగి ఎల్ఐసి కాలనీ - బండమైసమ్మ ఎక్స్ రోడ్ - ధర్నా చౌక్ మార్గ మీదుగా ఇందిరా పార్క్ ఎక్స్ రోడ్‌కు చేరుకోవాలి. ప్రయాణికులు తాజా ట్రాఫిక్ సమాచారం కోసం మా సోషల్ మీడియా వేదికలైన హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ఫేస్‌బుక్ పేజీ (facebook.com/HYDTP) , ఎక్స్ (@HYDTP) ఖాతాలను అనుసరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ప్రయాణంలో ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే, సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626 కు కాల్ చేయాలని సూచించారు.

### నేడే రైతుల ఖాతాల్లోకి

## పీఎం కిసాన్ నిధులు జమ

### మండల వ్యవసాయ అధికారిని రేణుక చక్రవర్తిని

**తలకొండపల్లి మార్చి12(జనంసాక్షి):** రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు మార్చి13,న రైతుల ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం జమ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారిని రేణుక చక్రవర్తిని తెలిపారు. గురువారం జనంసాక్షి విలేఖరితో మాట్లాడుతూ..ఈ పథకం కింద 22,వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు గౌహతి నుండి విడుదల చేయనున్నారని, దేశవ్యాప్తంగా అర్హత కలిగిన 9.కోట్ల 32 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున 18 వేల 640 కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. మండలంలోని రైతులందరూ నేడు సాయంత్రం 5 గంటలకు తమ పరిధిలోని రైతు వేదికలలో జరిగే వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి రైతులందరూ విధిగా హాజరు కావలసిందిగా కోరారు.

## ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైన మామిడి తోట



**మర్పల్లి మార్చ్ 12 (జనంసాక్షి):** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రానికి చెందిన రైతు ఎక్కెల్లి అమృతమ్మకు చెందిన మామిడి తోట ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 88లో మూడు ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్న మామిడి తోటలో బుధవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో కొన్ని మామిడి చెట్లు, డ్రిప్ పైపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనతో రైతు కుటుంబం తీవ్ర ఆవేదనలో మునిగిపోయింది. ఎక్కెల్లి అమృతమ్మ గత కొన్ని సంవత్సరాలుగా మూడు ఎకరాల్లో మామిడి తోటను ఎంతో శ్రమతో పెంచుకుంటూ సాగు చేస్తున్నారు. ఈ ఏడాది చెట్లు కాతకు వచ్చి మంచి దిగుబడి వచ్చే అవకాశాలు కనిపిస్తున్న సమయంలోనే అనుకోని విధంగా మంటలు చెలరేగి తోటను మింగేశాయి. మంటలు వ్యాపించి తోటలోని అనేక మామిడి చెట్లు పూర్తిగా కాలిపోవడంతో పాటు చెట్లకు ఏర్పాటు చేసిన డ్రిప్ సిస్టమ్ పైపులు, ఇతర సాగు సామగ్రి కూడా పూర్తిగా దగ్ధమయ్యాయి. కష్టపడి పెంచుకున్న తోట క్షణాల్లో బూడిద కావడంతో రైతు అమృతమ్మ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటనతో కుటుంబానికి భారీ ఆర్థిక నష్టం కలిగింది. ఈ ఘటనపై వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం తరఫున తగిన పరిహారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు, దాతలు ముందుకు వచ్చి బాధిత రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అధైర్య పడకండి అండగా ఉంటా

### ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి



**తాండూరు మార్చి 12(జనంసాక్షి):** అధైర్య పడకండి అండగా ఉంటానని ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి మనో ధైర్యం కల్పించారు గురువారం తాండూరు నియోజకవర్గ బషీరాబాద్ మండల కేంద్రంలో శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న బషీరాబాద్ మాజీ సర్పంచ్ శ్రవణ్ కుమార్ అనారోగ్యంతో బాధపడుతున్న ఆజిజ్ ను ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికిత్స పొందుతూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు అధైర్య పడకండి అండగా ఉంటానని మనోధైర్యం కల్పించారు. ఎవరు కూడా నిరాశకు గురి కావద్దని సూచించారు. అయన వెంట నాయకులు కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

## అక్సా వెల్ఫేర్ అసోసియేషన్ పేదలకు బట్టలు పంపిణి చెయ్యడం అభినందనీయం

### తుంకుంట మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ యాదవ్



**శామీర్ పేట్, మార్చి 12 (జనంసాక్షి):** తుంకుంట అక్సా వెల్ఫేర్ అసోసియేషన్ తూముకుంట రంజాన్ మాసం పురస్కరించుకొని గురువారం రోజు మున్సిపల్ సిబ్బంది, పేద ప్రజ లకు రంజాన్ రేషన్ కిట్లు,బట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధ్యక్షులుగా మోటివేషనల్ స్పీకర్ అబ్దుల్ రెహమాన్ ముంబై నుండి విచ్చేసి పంపిణి చేశారు. అతిథులుగా మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్, మాజీ ఎంపీపీ చంద్ర శేఖర్ యాదవ్, నాయకులు కృష్ణారెడ్డి, ఈశ్వర్ గౌడ్, రాజు యాదవ్, మధుసూదన్ రెడ్డి, దావూదీయ మస్జిద్ అధ్యక్షుడు బాబా, కమిటీ సభ్యులు మహమ్మద్ ముదస్సిర్, ఖాయరా ఫౌండేషన్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు. 150 మంది పేదలు,మున్సిపల్ సిబ్బందికి రేషన్ కిట్లను మరియు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో వచ్చిన అతిథులందరూ మంచి సందేశాన్ని ఇచ్చారు. ఇదేవిధంగా ప్రతి సంవత్సరం జరగాలని కోరారు. అధ్యక్షులు మహబూబ్ జానీ అక్సా వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.